# వదినె

రచన:
శ్రీ కొంపెల్ల కామశాస్త్రి

"టీ త్వరగా తీసుకురావమ్మా" అన్నాడు వేణు. "ఏమోయ్! ఈ వేళింత తొందర?.... మళ్లీ ఏమేనా మీటింగుందా!"—అని వదినె ప్రశ్నించింది. "ఆ! వుంది! తొందరగా వెళ్లాలి."—

"నేనుకూడారానుటోయ్ ఈవేళ? మీటింగులో నువ్వెల్లా మాట్లాడుతావో చూడాలని వుంది"— అన్నది వదినె కమల....—"ఆఁ! నువ్వుచూసి ఇపుడు నాకేం సర్టిఫికట్టు ఇయ్యక్కర్లేదు. ఇంట్లో వుండొచ్చు! మీటింగు కొస్తుందట!"—టీ గబగబా తాగేసి వెళ్లిపోయాడు! భర్తనడిగింది కమల:—"ఏమండీ! ఒక్కసారి వెళ్లనివ్వరూ!—ఎలా వుంటుందో చూద్దామని వుంది?, ఇన్నిసార్లు మీటింగవుతూంటే ఎప్పుడూ అడగలేదు...." అమాయికంగా అడిగింది. "సరే వెళ్లు!—త్వరగా రా!"—అన్నాడు భర్త!

కమలభర్త పాపం చాలా అమాయకుడు! ఎవరేది చెబితే అది నమ్మకం. "చూడన్నయ్యా, ఇవాళ వదిన ఏం చేసిందో!" అని చెప్పేప్పటికి భార్యమీద వచ్చిన కోపమంతా, ఆమె తనేం చెయ్యలేదని మళ్లా తనకి నచ్చచెప్పటంతోటే తగ్గిపోయేది. తమ్ముడు మాట్లాడుతున్నప్పుడు నిజంగా స్త్రీలని మీటింగులకి పంపనేకూడదని నిశ్చయానికి వచ్చాడు. అంతలో భార్య అడగగానే మనసు కరిగిపోయింది. కారణం భార్య అడిగిందనికాదు—అది అతని ప్రకృతి! కమల కూడా మీటింగుకి వెళ్లింది. తన మరది భావోద్రేకంతో ఉపన్యసిస్తున్నాడు. మహిళల పరిస్థితిని గురించి! ఒక్కనిముషం నిశ్చేష్టితురాలయి పోయింది. జలపాతంలా గంభీరమైన అతని ఉపన్యాస ధోరణిని మాత్రమే అభినందించగల్గింది ఆమె తనలో! దాని విషయ సంపదలో కొంత లోటువుంది. అది ఆమెకు తెలుసు. వింటోంది ఉపన్యాసం!

"స్త్రీ శక్తిస్వరూపిణి! ఆమెలోవుండే కార్యశూరత, సాహసం, చిత్తస్థైర్యం అధికతరమైనవని చెప్పడానికి సందేహంలేదు! కాని స్త్రీకి విద్యా సంస్కారం లేకపోడంతోటే, ఆ అపూర్వ గుణాలు విషమ ఫలితాల్నిస్తున్నాయి. విద్యా సంస్కారం లేనంతమాత్రాన్న ఏ వ్యక్తీ, నిజ గుణగణాల్ని కోల్పోడు, అవి నశించవు. ఏదో రూపంలో ఎప్పటికప్పుడు ప్రకటమవుతాయి. "కరణేషుమంత్రీ" మాత్రం కావాలి వీరికి. కాని ఆ గుణాలను సున్నితం చేయటానికి స్త్రీలకు విద్య అవసరం.

స్త్రీ సాహసి!....నిజంగా స్త్రీ తలపెట్టిన కార్యాన్ని కొనసాగించుకోగలదు—సినీమాకు తీసుకెళ్లకపోతే వంట వండకుండా కూర్చున్న

## భావదౌర్బల్యం

స్త్రీలని చూడ్డంలేమా?....అదే కార్య నిర్వాహకత్వం!—కాని యీ ఉదాహరణ ఆమె శక్తి యొక్క చదువుకోని రూపం—చదువుకుంటే,

ఈలాగే ఏపనైనా సాధించగలదు అని చెప్పడానికే! అప్పుడికోర్కెలు ఆమెకు వుండవులెండి. ఇటువంటి స్త్రీ నణగద్రొక్కడానికి ఒక్కటే ఉపాయం. "ఫలానా కవి చెప్పినట్లు, స్త్రీ వృత్త విధ్వంసకోయ్! రాక్షసి!" కూడా అని ఏకరువు పెట్టడం. పురాణ గ్రంథాలు పరమ సత్యాల్నే బోధిస్తున్నాయిగదా.... పోనీ ఆ చెప్పేవాళ్లే, వాటిల్లోవుండే స్త్రీ శక్తుల్నిగురించి చదవరు!.... పోనీ, ఈ గ్రంథాల్ని ప్రమాణాలుగా తీసుకుంటున్నారా అంటే, "యద్రోచతే, తద్గ్రాహ్యం"గా నడిపిస్తున్నారు. దాంట్లో తప్పున్నవిషయాలు మానడమూవల్లకాదు—అంటే, ఒక్క "స్త్రీ"ని గురించి ప్రతికూలంగా వ్రాసిన వ్రాతలే వారికక్కావాలి—మిగతావి కనపడవు—చూడరు !!

ఈ అభ్యుదయజాతికి అన్నీమారిపోవాలిట! భాష, సంఘం, భావాలు. కవిత్వం అన్నీమార్పుచెందాలి!.... కాని, (అప్పటి కలాతోచాయేమో) స్త్రీల విషయంలో ప్రతికూలంగావున్న భావాలు మార్చుకోలేకపోవడ మెందుచేతో?"

స్త్రీ దేవతామూర్తి!—బిడ్డలకు సరియైన శిక్షణిచ్చి, భావి పౌరులను చేయవలసిన బాధ్యతకూడా స్త్రీదే!—ఆ మాతృశ్రీదే ఆ ప్రత్యేక విషయంలో పరిపూర్ణ సామర్థ్యం! తన కొడుకు సత్పురుషుడు కావాలని కోరుకొనే తండ్రికూడా, ఆ కుర్రవాని సత్ప్రవర్తనకి పునాది వెయ్యగల యద్వితీయశక్తి స్త్రీయనీ, ఆమెకు విద్య నేర్పిస్తే, తను ఆశించినట్టుగా కుర్రాణ్ణి తయారు చేయగలదనీ గుర్తించాలి. బాలకుల్ని పాలకులుగాకూడా చెయ్యగలదు సుశిక్షితయయిన స్త్రీ. ఇందుకు ఎన్నో నిదర్శనములున్నా, అవి కన్పించవుగా పక్షపాతహృదయులకు!

"స్త్రీ అబల, కనకే ఎవరుపాడైనా, స్త్రీయే కారకురాలు అని నిందిస్తారు. ఆమె పతివ్రతగా వుండాలిట—అయితే, స్త్రీకి పాతివ్రత్యమెలా భూషణమో పురుషుడి కేకపత్నీవ్రతం ముఖ్యం కాదూ?.... ఒక స్త్రీ పతివ్రతాపథంనుంచి భ్రష్ఠ అయిందంటే, వెనువెంటనే ఒక పురుషుడు, తన ఏకపత్నీవ్రతం కోల్పోయాడన్న మాటే గాదూ?.... స్త్రీకి స్వేచ్ఛయిస్తే చెడిపోతుందనుకోవటం పురుషుల సంకుచిత భావాన్ని.... ప్రకటిస్తున్నది, పురుషుడికున్న నిగ్రహంనిబ్బరం స్త్రీకికూడా వున్నవి.

పునర్వివాహ విషయాలలో సాధ్యమైనంత పక్షపాతం కనబడుతోందంటే, సత్యదూరం కాదు. అష్టవర్షాద్భవేత్కన్యా.... స్నేహేన పాతల్యతాం అనే మామగారి కోరికకు అగ్నిసాక్షిగా తలూపినవారిలో ఎందరుమాటప్రకారం నడుచుకొంటున్నారు?....

ఈ విధంగా అంతా పక్షపాతమే కనిపిస్తుంది. కాబట్టి, స్త్రీలందరూ తమలోని గూఢమయిన శక్తుల్ని మేల్కొల్పి సహజ కార్య దీక్షతో పని చేస్తే, వారికి స్వేచ్ఛరావడం కష్టంగాదు; అందరూ దానికి తప్పక పూనుకోవాలి. మరియింక శెలవు."

సభలో ఇంత సేపూ కూర్చుని విషయాల్ని అవగతం చేసుకుంది కమల. మరిది ప్రవర్తనకీ, ఈ వుపన్యాసానికీ ఎంత తేడావుంది?.... అనుకుంటూ, ఇంటికి వెళ్లిపోయింది, కొంచెం సేపటికి మరిది వచ్చాడు. మినిట్సు బుక్కు చేత్తో పట్టు

కుని....మంచంమీద అన్నకి పక్క కూర్చుని వళ్లో మినిట్సు పుస్తకం పెట్టుకొని, కాళ్ల బూటు విప్పుకుంటున్నాడు.

"వాగ్ధాటి బాగానే వుందే, వేణూ!"

"ఏం? నువ్వూ వచ్చేవా ఉపన్యాసానికి?" గదిమేడు వేణు!

"ఆ! ఇంతకీ ఆ వుపన్యాసం స్త్రీలని బాగు చేయడానికి నువ్వు గొంతుకార్చుకొని ఇచ్చినది కాదూ మరి?—స్త్రీలు రాకపోతే ఎవరికిద్దా మనుకున్నావ్ నీ వుపన్యాసం?

సమాధానం వెంటనే తోచలేదు వేణుకి. ఉగ్రంగాచూస్తున్నాడు.

"వేణూ!—ఇన్నాళ్లు నా యెడల నువ్వెంత కఠినంగా ప్రవర్తించినా పోనీ లెమ్మని పూరుకొన్నాను. కాని, ఇకముందు అది సాగదు. ఇది నేను ఉపన్యాసం విన్న ఫలితంకాదు. నీ ఉపన్యాసంవల్ల. ఇది వరకల్లా స్త్రీ స్వేచ్ఛ గుర్తించని నీతో నేనెలాగో ప్రసక్తి పెట్టుకోదలుచుకో లేదు. కాని, ఒక విషయం. నాకోసం కాదు నేనంటూంట. రాబోయే నా చెల్లెలి కోసరం. ఒక లోకజ్ఞాన శూన్యుడితో ఏ స్త్రీ యేనా నెమ్మదిగా కాలంగడుప గలదు, అన్ని కష్టాలనీ ఓర్చి. కాని నీలాంటి, తెలుసున్నవారి దగ్గరకూడా అలాగే వర్తించడానికి వారికి వీలుపడదు. ఇందాకటినుంచీ నీవిచ్చిన ఉపన్యాసమంతా నాలికచివరి నించివచ్చినదే?"—

"కాదు వదినా!—నేను వెలిబుచ్చిన ప్రతీ భావం నా హృదయపు లోతుల్లోంచి బయలుదేరినదే! కాని, ఓవిధమైన దౌర్బల్యం నాకు అజేయమై, నన్ను బాధ పెడ్తోండేది. మరి ఇంకెప్పుడూ ఆ దుర్బలతకి బానిసను కాను"—జ్ఞాన నేత్రం తెరచి, రెండు కన్నీటి బిందువులు రాల్చేడు వాళ్లోవున్న మండలి ఫైల్‌మీద. ఆ పశ్చాత్తాపం, తన వదినె యొక్క ప్రశాంత ఉపదేశం తన హృదయానికి బంగారంలాగా అగ్నిశుద్ధి నిచ్చాయి. కల్మషమే ఆ రెండు అశ్రుకణాలూను.

★

